క్లుప్తంగా

సీఐటీయూ ధర్నా విజయవంతం చేయాలి

ఆత్మకూర్ (ఎస్) : కార్మికుల హక్కుల సాధనలో భాగంగా సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 20న సూర్యాపేట జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాకు కార్మికులు, ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని సీఐటీయూ మండల కన్వీనర్ యాతాకుల వెంకన్న శనివారం ఒక ప్రకటనలో కోరారు. బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన 4లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కనీస వేతనం నెలకు రూ.26వేలుగా నిర్ణయించాలని పేర్కొన్నారు.

భాగ్యరెడ్డి వర్మ వర్ధంతి

సూర్యాపేటటౌన్ : పట్టణంలోని సాయిగౌతమి జూనియర్ కళాశాలలో తెలంగాణ దళిత సంఘ సంస్కర్త భాగ్యరెడ్డి వర్మ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పోలెబోయిన కిరణ్, పీవైఎల్ జిల్లా కార్యదర్శి కునుకుంట్ల సైదులు, వెంకట్, నాగేందర్ పాల్గొన్నారు.

స్థల దాతకు సన్మానం



ఎన్‌ఆర్‌ఐ సత్యనారాయణరెడ్డిని సన్మానిస్తున్న ఎస్‌ఐ ప్రసాద్

నూతనకల్ : మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ భవన నిర్మాణానికి స్థలాన్ని సమకూర్చిన ఎన్‌ఆర్‌ఐ మర్రి సత్యనారాయణరెడ్డిని ఎస్‌ఐ ప్రసాద్ శనివారం ఘనంగా సన్మానించారు. చిల్పకుంట్లకు చెందిన ఎన్‌ఆర్‌ఐ మండల కేంద్రంలో మినీ స్టేడియం ఏర్పాటు కోసం 7ఎకరాల 20గుంటల స్థలంతో పాటు కొంత డబ్బును సమకూర్చి స్టేడియం నిర్మాణానికి కృషి చేశారు. అలాగే పోలీస్ స్టేషన్ భవన నిర్మాణం కోసం రెండు ఎకరాల స్థలాన్ని సుమారు రూ. 3కోట్లు వెచ్చించి అందించారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న జీపీ సిబ్బంది

నాగారం : మండల పరిధిలోని డి.కొత్తపల్లి గ్రామానికి చెందిన గ్రామ పంచాయతీ వర్కర్ గైగుళ్ల నర్సయ్య ఇటీవల అకాల మరణం చెందాడు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ సిబ్బంది, మండల కమిటీ సభ్యులు శనివారం మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ.5000 ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ మల్టీపర్పస్ వర్కర్స్ సంఘం మండల అధ్యక్షుడు బుక్క అంజయ్య, నాగచారి, ఈదుల యాదగిరి, అందె మైసర్, వీరాచారి, శంకరాచారి, సుజాత, దాసరి మారెమ్మ, పరశురాములు, అల్లయ్య, అశోక్, మల్లయ్య, నాగయ్య, సోమన్నచారి, నాగరాజు పాల్గొన్నారు.

రక్త నమూనాల సేకరణ

మునగాల : మండలంలోని కలకోవలో శుక్రవారం రాత్రి రేపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఫైలేరియా సర్వే, వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. వైద్య సిబ్బంది ఐదు బృందాలుగా ఏర్పడి 500 మంది నుంచి రక్త నమూనాలు సేకరించి జిల్లా ఫైలేరియా ల్యాబ్‌కు పంపించినట్లు వైద్యాధికారి శ్రీశైలం తెలిపారు. కాగా ఈ సర్వేను డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ఎండీ.నిరంజన్ పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొంపెల్లి సుజాత, ఎంపీటీసీ గన్నా భవాని, మలేరియా జిల్లా అధికారి షాబుద్దీన్, మలేరియా సబ్ యూనిట్ అధికారి అంజయ్య, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాస్, నోడల్ పర్సన్ లింగం రామకృష్ణ, కవిత, మధుకర్, లింగయ్య, సురేష్, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

నడిగూడెం : కరివిరాల గ్రామానికి చెందిన పోలీస్ సీఐ గుమ్మడిదల సత్యం మాతృమూర్తి నాగమ్మ (65) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో సత్యం కుటుంబాన్ని శనివారం టీపీసీసీ ఉపాధ్యక్షురాలు, కోదాడ మాజీ ఎమ్మెల్యే ఎస్.పద్మావతిరెడ్డి పరామర్శించారు.

మృతుడికి సీఐ నివాళి

అర్వపల్లి : రోడ్డు ప్రమాదంలో శుక్రవారం రాత్రి మృతి చెందిన పీఈటీ సైదుల మహేష్ అంత్యక్రియలు శనివారం జాజిరెడ్డిగూడెంలో జరిగాయి. ఈ సందర్భంగా మహేష్ మృతదేహానికి ఎల్బీనగర్ సీసీఎస్ సీఐ ఎల్లంల మన్మోహన్‌యాదవ్ శనివారం నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మహేష్ ఉద్యోగానికి ముందు స్థానిక గ్రంథాలయానికి దాతల సహాయంతో పోటీ పరీక్షల పుస్తకాలను సమకూర్చాడు. యువత గ్రంథాలయానికి వెళ్లి చదువుకునేలా వారిని ప్రోత్సహించాడు. దీంతో అతడి అంత్య క్రియల్లో వందలాది మంది పాల్గొని నివాళులర్పించారు.



నివాళులర్పిస్తున్న సీఐ మన్మోహన్

హరహర మహాదేవ.. శంభోశంకర!



సూర్యాపేటలోని 33వ వార్డులో నిర్వహించిన పూజల్లో పాల్గొన్న మంత్రి జగదీశ్‌రెడ్డి దంపతులు



సూర్యాపేటలోని పాత శివాలయంలో అభిషేకం చేస్తున్న భక్తులు



సూర్యాపేట : దర్శనం కోసం క్యూలో వెళ్తున్న భక్తులు



తిరుమలగిరిలో పార్వతీపరమేశ్వరుల కళ్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



తుంగతుర్తి : వెలుగుపల్లి శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



నాగారం : పసునూర్ శివాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



పెన్‌పహాడ్ : నాగులపహాడ్ శ్రీ త్రికూటేశ్వర ఆలయంలో పోటెత్తిన భక్తులు

భానుపురి : మహాశివరాత్రి సందర్భంగా శనివారం తెల్లవారుజాము నుంచే జిల్లాలోని అన్ని శైవ క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. సైనిక్‌పురి కాలనీలోని పాత శివాలయం, శ్రీఅన్నపూర్ణ సహిత విశ్వనాథ స్వామి దేవాలయం, రామలింగేశ్వరస్వామి, సంతోషిమాత ఆలయాలు భక్తులతో పోటెత్తాయి.

కుటుంబ సమేతంగా మంత్రి పూజలు..

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మంత్రి జగదీశ్‌రెడ్డి కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు చేశారు. పాత శివాలయం, అన్నపూర్ణ సహిత విశ్వనాథస్వామి దేవాలయం, శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయాల్లో స్వామివారిని దర్శించుకున్నారు

అన్నపూర్ణ సహిత దేవాలయంలో ఆర్డీఆర్..

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి స్థానిక అన్నపూర్ణ సహిత విశ్వనాథస్వామి దేవాలయంలో పార్టీ నాయకులతో కలిసి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

పిల్లలమర్రిలో శివాలయాల్లో..

సూర్యాపేట రూరల్ : మహాశివరాత్రి వేడుకలను పిల్లలమర్రి గ్రామంలోని శివాలయాల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. శివాలయాలకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తండోపతండాలుగా వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి–సునీత దంపతులు, కుమారుడు గుంటకండ్ల వేమన్‌రెడ్డిలు శివాలయాలను దర్శించుకొని స్వామి వారికి అభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదే విధంగా రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, జిల్లా కలెక్టర్ వెంకట్రావ్, ఎస్పీ రాజేంద్రప్రసాద్, డీసీఎంఎస్ చైర్మన్ వట్టె జానయ్య యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణలు ప్రత్యేక పూజలు చేశారు. ఈ వేడుకల్లో కౌన్సిలర్ బచ్చలకూరి శ్రీనివాస్, దేవాలయ చైర్మన్ జెర్రిపోతుల భిక్షం, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : మహాశివరాత్రి సందర్భంగా అర్వపల్లి చిన్నగుట్టపై ఉన్న ఉమామహేశ్వరస్వామి దేవాలయం, జాజిరెడ్డిగూడెంలోని పార్వతీరామలింగేశ్వర స్వామి దేవాలయం, పర్సాయపల్లి గుట్టపై ఉన్న జంగమేశ్వరస్వామి దేవాలయంతోపాటు గ్రామాల్లోని శివాలయాల్లో భక్తులు శనివారం పూజలు నిర్వహించారు. ఈ వేడుకల్లో జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్ యాదవ్–మాజీ ఎంపీపీ మనీషా దంపతులు, ఆలయాల నిర్వాహకులు పులిచర్ల మల్లికార్జున్, కృష్ణమూర్తి, నరహరి, శివరాంచంద్ పాల్గొన్నారు.

సూర్యక్షేత్రంలో శివరాత్రి వేడుకలు

తిమ్మాపురంలోని సూర్యక్షేత్రంలో శనివారం శనిత్రయోదశి మిలిత శివరాత్రి వేడుకలను నిర్వహించారు. వేడుకల్లో సూర్యక్షేత్ర వ్యవస్థాపకుడు కాకులారపు జనార్దన్‌రెడ్డి, గణపురం నరేష్ పాల్గొన్నారు.

తిరుమలగిరి : శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని తిమరులగిరిలో శనివారం పార్వతీపరమేశ్వరుల కళ్యాణం కనులపండువగా నిర్వహించారు. కళ్యాణోత్సవానికి భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు.

జలాల్‌పురం మల్లికార్జున స్వామి ఆలయంలో..

మహాశివరాత్రి వేడుకల సందర్భంగా జలాల్‌పురం మల్లికార్జున స్వామి ఆలయంలో చైర్మన్ ముత్తినేని సత్యం శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేడుకల్లో మాజీ ఎంపీపీ కొమ్మినేని సతీష్, తెడ్డు భాస్కర్, కమిటీ సభ్యులు వేముల దేవయ్య, చౌగోని శ్రీను, కొమ్ము ఉపేంద్ర, అంజయ్య పాల్గొన్నారు.

తుంగతుర్తి : మహాశివరాత్రి సందర్భంగా వెలుగుపల్లి, కొత్తగూడెం, అన్నారం, వెంపటి గ్రామాల్లోని శివాలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు.

కొత్తగూడెంలో అన్నదానం..

మహాశివరాత్రిని పురస్కరించుకొని కొత్తగూడెంలోని శివాలయంలో ఆలయచైర్మన్ దొనకొండ రమేష్–సంధ్య దంపతులు భక్తులకు అన్నదానం చేశారు.

చివ్వెంల : మండల పరిధిలోని ఉండ్రుగొండ, కుడకుడ, బి.చందుపట్ల గ్రామాల్లో మహాశివరాత్రి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో టీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జూలకంటి జీవన్‌రెడ్డి,



పిల్లలమర్రిలోని శివాలయంలో పూజలు చేస్తున్న కలెక్టర్ వెంకట్రావ్ దంపతులు



సూర్యాపేట : విద్యానగర్‌లోని రామలింగేశ్వర ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

పల్సి సైదులు, మున్సిపల్ సిబ్బంది ఎస్‌ఎస్‌ఆర్ ప్రసాద్, మనోజ్, చైతన్య, అజయ్ పాల్గొన్నారు.

నూతనకల్ : శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని శ్రీ శంభులింగేశ్వర ఆలయంతో పాటు గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు శనివారం పూజలు నిర్వహించారు. వేడుకల్లో ఎంపీపీ భూరెడ్డి కళావతిసంజీవరెడ్డి, సర్పంచ్ తీగల కరుణశ్రీగిరిధర్‌రెడ్డి, ఎంపీటీసీ పన్నాల రమామల్లారెడ్డి, ఎస్‌ఐ వై. ప్రసాద్ పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని శ్రీ శంభులింగేశ్వర, నాగులపహాడ్‌లోని శ్రీత్రికూటేశ్వర ఆలయం, అనంతారంలో శ్రీ శంభులింగేశ్వర, లింగాలలోని శ్రీ పార్వతీ సమేత రామలింగేశ్వర ఆలయాల్లో భక్తులు శనివారం పూజలు నిర్వహించారు. వేడుకల్లో దేవాలయ కమిటీ చైర్మన్‌లు సంకరమద్ది నిరంజన్ రెడ్డి, సామ బుచ్చిరెడ్డి, దాచేపల్లి సుధాకర్, పీఏసీఎస్ చైర్మన్ నాతాల జానకిరాంరెడ్డి, సర్పంచ్‌లు రాయిలి లక్ష్మి, మండలి మల్లయ్య, బైరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, అనంతుల శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

మద్దిరాల : శివరాత్రి వేడుకల సందర్భంగా మండల కేంద్రంలోని శ్రీపార్వతీరాంగేశ్వరస్వామి కళ్యాణానికి రైతు బంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ ఎస్‌ఏ.రజాక్–ఇంతియాజ్‌ఖాతూన్ దంపతులు స్వామివారికి నూతన పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ వేడుకల్లో దేవాలయ కమిటీ చైర్మన్ ఎల్లు శివారెడ్డి, అర్చకులు అనంతరామశాస్త్రి, శివప్రసాద్ శర్మ పాల్గొన్నారు.

ఆత్మకూర్ (ఎస్) : శివరాత్రి సందర్భంగా శనివారం మండల కేంద్రంలోని శివాలయంతో పాటు మల్లికార్జునస్వామి ఆలయం, ఏపూరు, ఏనుబాముల, పాతర్లపహాడ్, పాతసూర్యాపేట తదితర గ్రామాల్లో ఉన్న శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

నాగారం : మహాశివరాత్రి వేడుకల సందర్భంగా నాగారం, పసునూర్, ఈటూరు, ఫణిగిరి గ్రామాల్లోని శివాలయాల్లో, వర్ధమానుకోటలోని ఏకాంబేశ్వరస్వామి ఆలయంలో భక్తులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు కాశీ వెంకటేశ్వర్లు, కాశీ లక్ష్మణశర్మ పాల్గొన్నారు.

ఏకాంబేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని వర్ధమానుకోట గ్రామంలో ఉన్న ఏకాంబేశ్వరస్వామి ఆలయంలో శనివారం రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ మందుల సామేలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు కాశీ వెంకటేశ్వర్లు, వేముల రాంమూర్తి, చిప్పలపల్లి రాములు, పవన్, సోమలింగం తదితరులు పాల్గొన్నారు.



అర్వపల్లి : సూర్యక్షేత్రంలో పూజలు చేస్తున్న భక్తులు



తిరుమలగిరి : జలాల్‌పురంలో హోమం..



ఆత్మకూరు (ఎస్) : ఏపూరులో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు



పెన్‌పహాడ్ : అనంతారంలోని శివాలయంలో హోమంలో పాల్గొన్న భక్తులు



చివ్వెంల : మండల కేంద్రంలోని శివాలయంలో బారులుదీరిన భక్తులు



నూతనకల్‌లోని శ్రీ శంభులింగేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



అర్వపల్లి : పర్సాయపల్లి గుట్టపై ఉన్న జంగమేశ్వరస్వామి దేవాలయంలో..



మద్దిరాల : గోరెంట్లలో మల్లన్నస్వామి వద్దకు గంపలు ఎత్తుకెళ్తున్న మహిళలు

నేడు ఉచిత వైద్యపరీక్షలు

సూర్యాపేట : సూర్యాపేట పట్టణానికి చెందిన రిటైర్డు మున్సిపల్ ఆర్‌ఐ అనుములపురి నర్సయ్య జ్ఞాపకార్థం లయన్స్ క్లబ్, పద్మశాలీ యువజన సంఘం సంయుక్త ఆధ్వర్యంలో అపోలో డయాగ్నస్టిక్ సెంటర్ సౌజన్యంతో ఆదివారం స్థానిక అంతటి విజయ్ ఫంక్షన్ హాల్‌లో షుగర్, కొలెస్ట్రాల్ టెస్టులను ఉచితంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలను ఉదయం 7గంటలకు స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ ప్రారంభిస్తారని, ప్రజలంతా ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేపు ఉచిత కంటి వైద్యశిబిరం

భానుపురి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగుల సంఘం సూర్యాపేట కార్యాలయంలో వరంగల్‌కు చెందిన శరత్ మ్యాక్సీవిజన్ లేజర్ కంటి హాస్పిటల్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు దండా శ్యాంసుందర్ రెడ్డి, సుదగాని నాగేశ్వర్‌రావులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు వైద్య పరీక్షలు కొనసాగుతాయని పేర్కొన్నారు. పెన్షనర్లు తమ హెల్త్‌కార్డులు వెంట తెచ్చుకోవాలని వారు సూచించారు.

22న సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా ఆవిర్భావ వేడుకలు

తుంగతుర్తి : జిల్లా వ్యాప్తంగా ఈ నెల 22న నిర్వహించే సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా ఆవిర్భావ వేడుకలను జయప్రదం చేయాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా నాయకుడు ఎర్ర అఖిల్‌కుమార్ కోరారు. శనివారం మండల కేంద్రంలో ఆవిర్భావ వేడుకల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా నాయకులు కాసర్ల దుర్గయ్య, ఈజ్జాల వెంకన్న, గొడ్డలి నర్సయ్య, కందుకూరి కొండయ్య, వేర్పుల కర్ణాకర్, పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

అల్పాహారం అందజేత



అల్పాహారం అందిస్తున్న గండూరి కృపాకర్

సూర్యాపేట : పట్టణ క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, 45వ వార్డు కౌన్సిలర్ గండూరి కృపాకర్, పావనిల కుమార్తె జస్విక జన్మదినం పురస్కరించుకుని స్థానిక జనరల్ ఆసుపత్రిలో రోగులు, వారి సహాయకులకు శనివారం అల్పాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ డాక్టర్ రమేష్‌చంద్ర, సెక్రటరి యాదా కిరణ్, ట్రెజరర్ రాచకొండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

నడిగూడెం : రత్నవరంలోని శ్రీసీతారామస్వామి ఆలయ అభివృద్ధికి అదే గ్రామానికి చెందిన పోలంపల్లి రామకోటయ్య కుమారులు పోలంపల్లి వెంకట్, పోలంపల్లి సైదిబాబు శనివారం రూ.50 వేల విరాళం అందజేశారు. దాతలు ఆలయ నిర్మాణ సమయంలో రూ.1.70 లక్షలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పగడాల పద్మ, గ్రామ పెద్దలు పోలంపల్లి వెంకటేశ్వర్లు, వీరబాబు, సోమ శ్రీనివాసరావు, రామిని శ్రీరామ్‌రెడ్డి, కాసాని శ్రీనివాసరావు, పోలంపల్లి నర్సింహారావు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

నర్సింహులగూడెం వాసికి ఏపీఆర్‌సెట్‌లో 9వ ర్యాంకు

మునగాల : మండలంలోని నర్సింహులగూడెం గ్రామానికి చెందిన కాంపాటి విజయ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ రీసెర్చ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (ఏపీ ఆర్‌సెట్-2022)లో రాష్ట్ర స్థాయిలో అర్థశాస్త్రం విభాగంలో 9వ ర్యాంకు సాధించాడు. దీంతో శుక్రవారం నిర్వహించిన వెబ్ కౌన్సిలింగ్‌లో నాన్ లోకల్ కోటాలో గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీలో ప్రవేశం పొందాడు.

జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలి



సంతకాల సేకరణ నిర్వహిస్తున్న నాయకులు

నాగారం : జనాభాలో 52శాతం ఉన్న బీసీలకు విద్య, ఉద్యోగ, రాజకీయ, ఆర్థికరంగాల్లో జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొడ్డు కిరణ్ అన్నారు. బీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ బీఎస్పీ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 52శాతం ఉన్న బీసీలకు అన్నిరంగాల్లో 52శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో బీసీ జనగణన చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి శ్రీను, నియోజకవర్గ అధ్యక్షుడు చింతకుంట్ల చింతయ్య, ఉపాధ్యక్షురాలు కమటం శోభాబాయ్, బీఎస్పీ మండల అధ్యక్షుడు ఈదుల యాదగిరి, ప్రధాన కార్యదర్శి ఎర్ర రాంబాబు, కార్యదర్శులు మల్లేపాక వెంకటేష్, కొమ్ము శ్రీకాంత్, పేరాల సోమయ్య, తాడోజు వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవం

అర్వపల్లి : మండల పరిధిలోని తిమ్మాపురంలో శనివారం పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్‌ఎంపీపీ మారిపెద్ది భవానిశ్రీనివాస్‌గౌడ్ అన్నదానం చేశారు. అలాగే నల్లగొండ సీడ్‌బాల్స్ విద్యార్థులు సీడ్‌బాల్స్‌ను అందజేసి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మంగమ్మ, చల్లా వేణుధర్‌రెడ్డి, కె.దశరథరామారావు, లింగమూర్తి, సందీప్‌రెడ్డి, మధుసూదన్, కొండల్, వెంకటేష్, రమణ, రమేష్, సీడ్‌బాల్స్ విద్యార్థులు జశ్వంత్, దీక్షిత, హరీందర్ తదితరులు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న వైస్‌ఎంపీపీ

శ్రీబాలకోటేశ్వరస్వామి జాతర ప్రారంభం

నడిగూడెం : వల్లాపురం రెవెన్యూ పరిధిలోని మూడు వందల ఏళ్లనాటి శ్రీబాలకోటేశ్వరస్వామి ఆలయంలో శనివారం జాతర ప్రారంభమైంది. ఈ జాతర నాలుగు రోజుల పాటు జరగనుంది. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఖమ్మం జిల్లా పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కాగా జాతరకు హాజరైన భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ నాగేశ్వరరావు, ధర్మకర్త ఏలేటి వెంకటేశ్వర రెడ్డి, వల్లాపురం సర్పంచ్ వట్టికూటి చంద్రయ్య, ఆలయ అర్చకులు సంగమేశ్వరప్రసాద్‌శర్మ, ఇంకూరు శేఖర్, నలబోతు చంద్రారెడ్డి, యాజా విష్ణువర్ధన్‌రెడ్డి, సైదులు, అచ్చిరెడ్డి, వెంకట్రాములు, రామనర్సయ్య, రామిని రామిరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

శిథిల భవనం.. ఇరుకు గదులు!

- మద్దిరాలలోని కస్తూరిబా పాఠశాలలో కొరవడిన కనీస వసతులు
- సరిపోను తరగతి గదులు లేక విద్యార్థినులకు ఇబ్బందులు
- నూతన భవన నిర్మాణం పూర్తిచేసి అందుబాటులోకి తేవాలని వేడుకోలు



తరగతి గదిలో తమ సామగ్రితో ఇరుకుగా కూర్చున విద్యార్థులు



స్థలం లేకపోవడంతో గది బయట ఉంచిన విద్యార్థుల బ్యాగులు

మద్దిరాల : మండల కేంద్రంలోని కస్తూరిబాగాంధీ బాలికల పాఠశాలకు సొంత భవనం పూర్తికాకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం శిథిలావస్థకు చేరిన బీసీ బాలుర వసతి గృహంలో ఈ పాఠశాలను కొనసాగిస్తున్నారు. కస్తూరిబా పాఠశాలలో ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు మొత్తం 250 మంది విద్యార్థినులు విద్యను అభ్యసిస్తున్నారు. అయితే వారికి సరిపడా గదులు లేకపోవడంతో చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గదుల కొరత కారణంగా కొంతమంది విద్యార్థులు అడ్మిషన్లు కూడా పొందలేకపోయారు.

ఆరే గదులు..

ప్రస్తుతం కస్తూరిబా పాఠశాల కొనసాగుతున్న భవనంలో ఆరు గదులు మాత్రమే ఉన్నాయి. వాటిలోనే విద్యార్థులు చదువుతూ సామన్లను భద్రపరుచుకుంటున్నారు. వాటిల్లోనే సుమారుగా 45 నుంచి 50 మంది చొప్పున విద్యార్థులు నిద్రిస్తున్నారు. ఇక వర్షాకాలంలో అయితే భవనం కురుస్తుండటం కారణంగా విద్యార్థినులు గదుల్లో కూడా ఉండలేని పరిస్థితి నెలకొంటుంది. దీనికితోడు భవనం శ్లాబుపై పెచ్చులు ఊడి పడుతున్నాయి. పైగా విద్యార్థులకు సరిపడా మరుగుదొడ్లు, స్నానపు గదులు, ట్యూబ్‌లైట్లు, ఫ్యాన్లు లేవు. బెంచీలు లేకపోవడంతో తరగతి గదుల్లో నేల పైనే కూర్చొని పాఠాలు వింటున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కస్తూరిబా పాఠశాల కోసం నిర్మిస్తున్న నూతన భవనం పనులను వెంటనే పూర్తిచేయాలని, పాఠశాలలో అన్ని రకాల మౌలిక వసతులు కల్పించాలని విద్యార్థినులు కోరుతున్నారు.

కొనసాగుతున్న భవన నిర్మాణం..

రాష్ట్ర ప్రభుత్వం గత రెండు నెలల క్రితం మద్దిరాల కస్తూరిబాగాంధీ బాలికల పాఠశాలకు రూ. 3.50కోట్లతో నూతన భవనాన్ని మంజూరు చేసింది. ఆ భవనానికి సంబంధించి ప్రస్తుతం స్లాబ్ పూర్తయింది. ప్లాస్టరింగ్ పనులు కొనసాగుతున్నాయి. ప్రభుత్వం కేటాయించిన నిధులు మార్చి 31వ తేదీలోపు అయిపోతాయని ఇంకా భవన నిర్మాణానికి అదనంగా నిధుల అవసరం అని కాంట్రాక్టర్ తెలిపారు. నిధుల కోసం అధికారులకు ప్రపోజల్స్ పంపినట్లు పేర్కొన్నారు. ఆ డబ్బులు కూడా మంజూరైతే మే నెల వరకు భవన నిర్మాణ పనులు పూర్తవుతాయని తెలుస్తోంది.

పనులు జరుగుతున్నాయి

గతంలో కంటే ఇప్పుడు విద్యార్థుల సంఖ్య పెరగడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పాఠశాలలో మౌలిక సదుపాయాలు సమకూర్చుతున్నాం. ప్రస్తుతం నూతన భవన నిర్మాణ పనులు పూర్తి కావొస్తున్నాయి. వచ్చే అకాడమిక్ ఇయర్‌కి నూతన భవనంలో అన్ని వసతులతో కూడిన విద్యా బోధన కొనసాగిస్తాం. ప్రస్తుతం విద్యార్థులకు ఎలాంటి సమస్యలు రాకుండా చూసుకుంటున్నాం.

- తేజశ్రీ, ప్రత్యేక అధికారిని, కేజీబీవీ

వసతులు కల్పించాలి

పాఠశాలలో సరిపడా తరగతి గదులు లేవు. ఒక్క గదిలోనే సామగ్రి దాచుకోవడం, నిద్రపోవడం, పాఠాలు వినడం వల్ల చాలా ఇబ్బందిగా ఉంటుంది. నూతన భవన నిర్మాణం త్వరగా పూర్తి చేసి వసతులను కల్పించాలి.



- గాయత్రి, విద్యార్థిని

చెట్ల కిందే పాఠాలు వింటున్నాం

సరిపడా తరగతి గదులు లేకపోవడంతో చెట్ల కింద పాఠాలు వినాల్సి వస్తోంది. తరగతి గదిలో బెంచీలు కూడా లేవు. ఇరుకుగా ఉన్న గదుల్లోనే ఒక తరగతికి 50 మంది విద్యార్థుల చొప్పున కింద కూర్చుంటున్నాం. నూతన భవనం పనులు వేగవంతంగా పూర్తిచేయాలి.



- హారిక, విద్యార్థిని